క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.59, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 40, బెండకాయ 28, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 48, పందిరి బీర 35, క్యాబేజీ 24, క్యారెట్ 40, దొండ 35, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 60, గోకరకాయ 40, కీర 15, దోసకాయ 28, బీట్‌రూట్ 26, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 21, చామగడ్డ 38, మొరంగడ్డ 40, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

జిల్లా మజ్దూర్‌సెల్ కో కన్వీనర్‌గా నర్సింహ



నియామకపు పత్రం అందుకుంటున్న గండికోట నర్సింహ

లాలాపేట: తార్నాక డివిజన్ ఓయూ క్యాంపస్ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన గండికోట నర్సింహ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ మజ్దూర్ సెల్ కో కన్వీనర్‌గా నియమితుల య్యారు. ఈ మేరకు నియామకపు పత్రాన్ని శుక్రవారం బీజేపి జిల్లా అధ్యక్షులు శ్యామ్‌సుందర్‌గౌడ్ చేతుల మీదుగా అందుకున్నారు.

లాలాపేటలో బొడ్రాయి పునః ప్రతిష్ఠాపన మహోత్సవం

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలో ఈ నెల 21 నుంచి నిర్వహించతలపెట్టిన బొడ్రాయి జీర్ణోద్ధరణ పూర్వక పునఃప్రతిష్ఠా మహోత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఉత్సవాల నిర్వాహణ నిమిత్తం బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి రూ.1,01,116విరాళం ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం లాలాపేటలో జరిగిన ఉత్సవ సన్నాహక సమావేశంలో ముందుగా ప్రకటించిన ఆ మొత్తాన్ని చెక్ రూపంలో బండ చంద్రారెడ్డి ఉత్సవ నిర్వాహణ సభ్యులకు అందజేశారు.

దేశాన్ని కాపాడుతాం.. అభివృద్ధిపథంలో తీసుకెళ్తాం



లాలాపేటలో కలశ పూజ చేస్తున్న బీజేపీ నాయకులు

లాలాపేట: స్వాతంత్య్ర దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని భారతదేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న నా మట్టి...నా దేశం కార్యక్రమాన్ని శుక్రవారం తార్నాక డివిజన్‌లో బీజేపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో లాలాపేటలోని భగవతీ పోచమ్మ దేవాలయంలో ప్రత్యేకంగా కలశ పూజ చేశారు. దేశాన్ని కాపాడుతాం..అభివృద్ధి పథంలో తీసుకెళ్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పాల్గొన్నారు.

చిలకలగూడ డీఐగా శ్రీశైలం నాయక్



చిలకలగూడ : చిలకలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీశైలం నాయక్ పదవీ బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన నాయక్ కమాండ్ కంట్రోల్ విభాగంలో విధులు నిర్వహిస్తు చిలకలగూడ డీఐగా పదోన్నతి పొందారు. చిలకలగూడ డీఐగా ఇటీవలే చేరిన రుక్మిణీ స్పెషల్‌బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

వార్డు కార్యాలయ నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులపై కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని నామాలగుండ ప్రాంతంలో కొనసాగుతున్న మున్సిపల్ డివిజన్ వార్డు కార్యాలయం నూతన భవన నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ సామల హేమ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రూ.1.95 కోట్ల వ్యయంతో వార్డు ఆఫీసు నిర్మాణం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడవులోగ పనులు పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశాలిచ్చారు. భవన నిర్మాణం విషయమై సంబంధిత కాంట్రాక్టరుతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్,స్థానిక నాయకులు ఉన్నారు.

తెలంగాణ ఏర్పడ్డాకే సనత్‌నగర్ అభివృద్ధి

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



వినాయక దేవాలయాన్ని సందర్శించి ఈఓతో మాట్లాడుతున్న మంత్రి తలసాని

అమీర్‌పేట : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాకే సనత్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేట డివిజన్ లోకాస్ ఎస్‌ఆర్‌టీలో ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు.అక్కడ జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించి స్థానికంగా ఉన్న ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.డ్రైనేజీ లైన్‌తో పాటు మంచినీటి పైప్‌లైన్ కూడా వేయాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ వాటర్ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. 50 ఏళ్లలో జరగని అభివృద్ధి గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో చేశామని,దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కారమయ్యాయని గుర్తు చేశారు.సమస్యను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నామని,ఈ విషయం నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని అన్నారు.మంత్రి తలసాని వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి,బీఆర్‌ఎస్ నాయకులు హనుమంత్‌రావు,అశోక్‌యాదవ్,సుమిత్‌సింగ్,లలితాచౌహాన్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు

గురుమూర్తినగర్‌లోని వినాయ దేవాలయం అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి తలసాని తెలిపారు.ఆలయాన్ని సందర్శించిన మంత్రి అభివృద్ధి, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులు,అర్చకులను అడిగి తెలుసుకున్నారు.

బూత్‌ల కేటాయింపుల్లో నిర్లక్ష్యం

- అధికారులకు ఫిర్యాదు
- పరిశీలించిన ఉప కమిషనర్



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఉప కమిషనర్

రాంగోపాల్‌పేట్: బూత్‌ల కేటాయింపులో అధికారుల నిర్లక్ష్యంతో ఓటర్లు పడుతున్న విషయం తెలుసుకుని బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఓటరు ఉండేది ఒక చోట ఓటు వేసే బూత్ మరో చోట ఉండటాన్ని స్థానిక బీజేపీ నాయకులు దయానంద్ ఉప కమిషనర్ శంకర్ దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో ఉప కమిషనర్‌తో పాటు సూరింటెండెంట్ జగదీశ్వర్‌రెడ్డి, సూపర్‌వైజర్ చందర్‌రావు తదితరులు సోమసుందరం వీధిలోని కొత్త ఎల్లయ్య మెమోరియల్ పాఠశాలకు వచ్చి ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఆవులమందకు చెందిన ఓటర్లకు పక్కనే బూర్గు విశ్వనాథం పాఠశాలలో బూత్‌లు ఉండేవని భవనం నిర్మాణ సమయంలో సుభాష్‌రోడ్‌లోని సెయింట్ ఆంథోన స్కూల్‌కు తరలించారని స్థానికులు అధికారుల దృష్టికి తెచ్చారు. పాఠశాల భవన నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా బూత్‌ను మాత్రం మార్చడం లేదని దీంతో దూర ప్రాంతంలో ఉన్న పాఠశాలలోని బూత్‌కు వెళ్లి ఓటు వేయాల్సి వస్తుందని వారు తెలిపారు. ఆవులమందలోని ఒకే కుటుంబంలోని ఓటర్లకు వేరు వేరు చోట్ల బూత్‌లు కేటాయించారని వారు అధికారులకు తెలిపారు.అలాగే బర్తన్‌కాంపౌండ్ వాసులకు పక్కనే ఉన్న కళాసీగూడ స్కూలును కాదని వైఎంసీఏ జూనియర్ కళాశాలలో బూత్‌ను కేటాయించారని దీనిపై గతంలో అనేక మార్లు ఫిర్యాదు చేసినా గత అధికారులు పట్టించుకోలేదని దయానంద్ తదితరులు అధికారుల దృష్టికి తెచ్చారు. వెంటనే తప్పులను సరిదిద్ది రాబోయే ఎన్నికల్లో ఓటర్లకు అనుకూలంగా ఉండేలా మారుస్తామని అధికారులు తెలిపారు.

కేటీఆర్ చొరవతోనే రక్షణ భూముల కేటాయింపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న క్రిశాంక్

కంటోన్మెంట్: మంత్రి కేటీఆర్ చొరవతోనే కంటోన్మెంట్‌లో రెండు కీలక ఫ్లైఓవర్ నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రక్షణ శాఖ ఆమోదం తెలిపిందని ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. ఈ మేరకు పికెట్‌లోని తన కార్యాలయ ఆవరణలో విలేరులతో మాట్లాడారు. నగరం చుట్టూ పెద్ద ఎత్తున రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతూ ఉండగా, కేవలం కంటోన్మెంట్‌లో మాత్రమే ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రాజెక్టు కూడా చేపట్టలేదన్నారు. భూసేకరణలో జాప్యమే ఇందుకు ప్రధాన కారణం అన్నారు. డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా కూడా కొనసాగుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఏ ఒక్క రోజూ కంటోన్మెంట్ సమస్యలు పట్టించుకోలేదన్నారు. పైగా మంత్రి కేటీఆర్ ప్రయత్నాలను విమర్శించడం తగదన్నారు. కేవలం కంటోన్మెంట్‌లో రోడ్ల కోసమే 2016 నుంచి కేటీఆర్ ప్రయత్నించాడన్నారు. కేంద్రంలో ఇప్పటి వరకు నలుగురు రక్షణ మంత్రులు మారినప్పటికీ వారందరినీ కలిసి విజ్ఞప్తి చేస్తూ వచ్చాడన్నారు. ఇందుకు ప్రతిఫలమే తాజాగా రక్షణ శాఖ భూముల కేటాయింపు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇక స్థానిక బీజేపీ నేతలు డబుల్ స్టాండర్డ్స్‌తో వ్యవహరిస్తున్నారని అన్నారు. జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ విలీనంపై బీజేపీ విధానాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్ కుమార్, మోసీ, రఘు, సాయి కిరణ్, సాయి, రాకేశ్ చారి, సూరజ్, శ్రీను, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తితోపాటు క్రీడల్లోను రాణించాలి



క్రీడపోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

కంటోన్మెంట్ : నర్సింగ్ వృత్తితోపాటు క్రీడల్లోను రాణించి మానసిక, శారీరక ధృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఈశ్వరీబాయి మెమోరియల్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ వైస్ చైర్మన్ డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. ట్రైన్డ్ నర్సెస్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా (టీఎన్ఏఐ) మూడవ రాష్ట్రస్థాయి సదస్సు సందర్భంగా మారేడుపల్లి జీహెచ్‌ఎంసీ మైదానంలో శుక్రవారం నర్సింగ్ స్కూల్స్, కాలేజీ విద్యార్థులకు పలు రకాల క్రీడాపోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామచంద్రారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. నిరంతరం నిబద్ధతతో చదువుకునే విద్యార్థులకు ఈ క్రీడ పోటీలు ఎంతో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. తెలంగాణలోని 48 నర్సింగ్ స్కూల్స్, కాలేజీలకు చెందిన 2600 మంది నర్సింగ్ విద్యార్థులు పలు రకాల క్రీడాపోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించారు. ఈనెల 12వ తేదిన బోయిగూడ రైల్ కళారంగ్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్ఏఐ కార్యదర్శి స్వరాజ్యవాణి, ఎస్ఎన్ఏ అడ్వైజర్ బాంధవి, ఇవ్వాజ్ థియాస్, వెంకటరమణ, ప్రసన్నకుమారి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఓయూ టెక్నాలజీ కాలేజీలో పార్ట్‌టైం అధ్యాపక ఉద్యోగాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో బోధించేందుకు పార్ట్‌టైం అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. కెమికల్ ఇంజినీర్, ఫార్మసీ విభాగాలతో పాటు ఫుడ్, టెక్స్‌టైల్ టెక్నాలజీలలో 10 ఖాళీలకు ఈ నెల 14న ప్రకటన విడుదల చేయనున్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 21 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు పేర్కొన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలలో సాధించిన మార్కుల ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 26న రాత పరీక్ష, 29 నుంచి సెప్టెంబరు 2 వరకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు.

వినోభానగర్‌లో పాముల బెడద



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట వినోభానగర్‌లో గత కొంత కాలంగా పాముల బెడద వేధిస్తోంది. నిరుపయోగంగా మారిన రామ్ థియేటర్, దాని ఆవరణలో పేరుకుపోయిన చెట్లపొదల నుంచి క్రిమి కీటకాలు, పాములు జనవాసాల మధ్యకు వస్తున్నాయి. దీంతో బస్తీ ప్రజలు కంటిమీద కునుకు లేకుండా బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. శుక్రవారం రెండు పెద్ద నాగుపాములు రామ్‌థియేటర్ ప్రాంగణం నుంచి వినోభానగర్ ఇండ్లలోకి వచ్చాయి. దీంతో బెంబేలెత్తిపోయిన స్థానికులు స్నేక్ సొసైటీ వారికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఒకపామును పట్టుకోగా రెండవది తప్పించుకుపోయింది. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న రామ్ థియేటర్‌లో, దాని పరిసర ప్రాంతాల్లో తిష్టవేసిన పాములను, క్రిమి కీటకాలను పారదోలేందుకు చర్యలు తీసుకోవాలని వినోభానగర్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన సౌత్ కొరియా విద్యార్థులు



డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డితో కొరియా విద్యార్థులు

లాలాపేట: హైదరాబాద్ నగర పర్యటనకు వచ్చిన సౌత్‌కొరియా దేశానికి చెందిన వియ్ లవ్ యూ ఫౌండేషన్, వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ యూనివర్సిటీకి చెందిన స్టూడెంట్స్ వాలంటీర్ గ్రూప్ విద్యార్థులు శుక్రవారం తార్నాకలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ అంతర్జాతీయ నగరాలకు దీటుగా హైదరాబాద్‌ను రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్నట్లు కొరియన్ విద్యార్థులకు వివరించారు. జీహెచ్‌ఎంసీ పాలన, పౌరులకు కల్పిస్తున్న సౌకర్యాలు, చేపడుతున్న అభివృద్ధి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. వారు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. హైదరాబాద్ నగర అభివృద్ధిపై కొరియన్ విద్యార్థులు హర్షం వ్యక్తం చేసినట్లు డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు.

జర్నలిజం బాధ్యత గల వృత్తి



ప్రముఖ జర్నలిస్టు రామానంద ఛటర్జీకి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: జర్నలిస్టుల వృత్తి బాధ్యత గలదని అలాగే కత్తి మీద సాములాంటిదని మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు కుమారుడు, పీవీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం తెలంగాణా ఆల్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీఏజేఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించారు. టీఏజేఎఫ్ అధ్యక్షులు డాక్టర్ తనుగుల జితేందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దివంగత ప్రధాని పీవీ నరసింహారావుకు కూడా జర్నలిస్టేనని గుర్తు చేశారు. సమాజాన్ని చైతన్య పరిచేది జర్నలిస్టులేనని సమాజంలో మార్పు తీసుకుని వచ్చే సత్తా జర్నలిస్టులకే ఉందన్నారు. టీజేఎఫ్ చాంబర్స్ కమిటీ చైర్మన్ టీవీ ప్రభాకరరావు, ఎఫ్ఎల్‌డీఐ ప్రెసిడెంట్ పింగళి వెంకటేశ్వరరావు, డాక్టర్ టీఆర్‌కే రావు, డాక్టర్ దుర్గా ప్రసాద్, దత్తాత్రేయతో పాటు వివిధ జిల్లాల నుంచి జర్నలిస్టులు, అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారు



మాట్లాడుతున్న రిజ్వాన్ అర్షద్

రసూల్‌పురా: కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కర్ణాటక శివాజీనగర్ ఎమ్మెల్యే, మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు రిజ్వాన్ అర్షద్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం సీనియర్ నేత జీవకన్ ఆధ్వర్యంలో శుక్రవారం లీప్యాలెస్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నాయకుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన రిజ్వాన్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారని కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఏ విధంగా పట్టం కట్టారో ఇక్కడ కూడా ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకవస్తారని పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియో జకవర్గాల్లో కాంగ్రెస్‌కు మంచి పట్టుందని అన్నారు. కంటోన్మెంట్‌లో పార్టీకి పూర్వవైభవం తీసుకవచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చే యాలని సూచించారు. సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్, పార్టీ సీనియర్ నా యకులు అయూబ్‌ఖాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, డిబీ. దేవేందర్, ప్యారసాని రామ్‌కుమార్ నరసింహన్ కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు..లిఫ్ట్‌ను మరిచారు



పని చేయని లిఫ్ట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

లాలాపేట: తార్నాక సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ఫుట్ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించిన అధికారులు దానికి ఏర్పాటు చేసిన లిఫ్టలను ప్రారంభించడం మరిచారని బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న ఎద్దేవా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఫుట్ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్ వద్ద స్థానికులతో కలిసి నిరసన తెలిపారు. రెండు నెలల క్రితం డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి చేతుల మీదుగా ఫుట్ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు కానీ దానికి రెండు వైపులా ఏర్పాటు చేసిన లిఫ్టలను వినియోగంలోకి తీసుకురాకపోవడం వల్ల వాటి సేవలు అందుబాటులోకి రాలేదన్నారు.

ఓపెన్ నాలాపై స్లాబ్ నిర్మాణం చేపట్టాలి



ఓపెన్ నాలాపై స్లాబ్ నిర్మాణం చేయాలనీ నిరసన తెలుపుతున్న దృశ్యం

లాలాపేట: ఓపెన్ నాలాపై స్లాబ్ నిర్మాణం చేపట్టాలని శాంతినగర్ నార్త్ లాలాగూడ ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ఓపెన్ నాలా వద్ద స్థానికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ తక్షశిలా పబ్లిక్ స్కూల్ సమీపంలో జనవాసాల మధ్య ఉన్న ఓపెన్ నాలాతో దినమంతా దుర్గంధం, రాత్రైతే దోమల స్వైరవిహారంతో నానా అవస్థలు ఎదుర్కొంటున్నామన్నారు. ఓపెన్ నాలా నుంచి వచ్చే దుర్వాసనతో చాలా మంది శ్వాసకోశ వ్యాధుల బారినపడుతున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో నాలా పొంగి జనావాసాల మధ్యకు వరద నీరు ప్రవహిస్తున్న సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రజా ప్రతినిధులు తమ సమస్యను పట్టించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, రాయపరెడ్డి,ముత్యంరెడ్డి,శాంతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రొ.లింబాద్రికి సన్మానం



ప్రొ.లింబాద్రిని సన్మానిస్తున్న పరిశోధక విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రిని ఓయూ పరిశోధన విద్యార్థులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం దూరవిద్యా కేంద్రంలో ఓయూ పబ్లిక్ అడ్మిన్‌స్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో పబ్లిక్ అడ్మిన్‌స్ట్రేషన్ ఇన్ డిజిటల్ ఎర ఇష్యూస్, ఛాలెంజస్ అండ్ ప్రాస్‌పెక్ట్ అనే అంశం పై రెండు రోజులు జరిగిన జాతీయ సదస్సు ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొ.లింబాద్రి విచ్చేసి మాట్లాడారు. అనంతరం పరిశోధన విద్యార్థులు నంద్రు నర్సింహరావు, వెంకట్, విజయ్, సునీల్‌శెట్టి, రవితేజా విష్ణు తదితరులు శాలువా కప్పి, గజమాలతో సత్కరించారు. గతనెల 31న ఓయూ అధ్యాపకుడిగా ఉద్యోగ విరమణ చేసి తొలిసారి వర్సిటీకి రావడంతో పరిశోధన విద్యార్థులు ఆనందంతో ప్రొ.లింబాద్రిని సన్మానించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

భూముల కేటాయింపు చరిత్రాత్మకం



స్వీట్లు పంచిపెడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. మల్లికార్జున్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ పరిధిలోని రహదారుల విస్తరణకు రక్షణ శాఖ భూముల కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకం అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుక మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం తాడ్‌బండ్ చౌరస్తాలో బీజేపీ కార్యకర్తలతో కలిసి స్థానికులకు స్వీట్లు పంచిపెడుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ కంటోన్మెంట్ పరిధిలోని రాజీవ్ రహదారి, నాగ్‌పూర్ హైవేలను విస్తరించడంతో పాటు ఫ్లైఓవర్లు నిర్మించడం ద్వారా దీర్ఘకాలంగా ఉన్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కంటోన్మెంట్ భవిష్యత్ చిత్రం పూర్తిగా మారిపోతుందన్నారు. రోడ్డు విస్తరణతో వ్యాపారాలు కోల్పోయే ప్రైవేటు వ్యక్తులకు తగిన నష్టపరిహారం దక్కేందుకు తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు.

బీజేపీలో పలువురికి బాధ్యతల అప్పగింత



నియామకపత్రాలు అందజేస్తున్న దృశ్యం

బౌద్ధనగర్: భారతీయ జనతా పార్టీ మహంకాళి శిఖర జిల్లా నుండి పలువురు బౌద్ధనగర్ డివిజన్ సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా బీజేపీ అధ్యక్షులు శాయమ్‌సుందర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం బౌద్ధనగర్‌లో వారికి నియామకపత్రాలను అందజేశారు. ప్రొటోకాల్ సెల్ కన్వీనర్‌గా సత్యనారాయణ , ఓబీసీ సెక్రటరీగా వీఎస్. రాజు, గీతా సెల్ కో-కన్వీనర్ భాస్కర్‌గౌడ్, మజ్దూర్ సెల్ కో-కన్వీనర్ సారథి, కల్చరల్ సెల్ కో-కన్వీనర్ డీ. రాజు, చేనేత సెల్ కో-కన్వీనర్ నవీన్, సోషల్ మీడియా కో-కన్వీనర్ సంపత్, స్లమ్ సెల్ కో-కన్వీనర్ ఓములు, స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ చైతన్య, హెత్ సెల్ కో-కన్వీనర్ రాజుగౌడ్, హౌసింగ్ సెల్ కన్వీనర్ వెంకటేష్, మున్సిపల్ సెల్ జాయింట్ కన్వీనర్ సుబ్బారావు, సివిల్ సప్లై కో-కన్వీనర్ సుధాకర్ గుప్త, ఎస్సీ మోర్చా స్పోక్స్‌పర్సన్‌గా పాందు రంగారావులను నియమించినట్లు తెలిపారు. కేటాయించిన బాధ్యతల పట్ల అంకిత భావంతో పని చేస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా శ్యాంసుందర్ గౌడ్ సూచించారు. రవిప్రసాద్ గౌడ్, స్వరూప గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలి



ఓయూలో ర్యాలీ..

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని ఓయూలో ర్యాలీ చేపట్టారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ (విజృంభణ), రీసెర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 10న గ్రూప్-2 వాయిదాకు టీఎస్‌పీఎస్సీ కార్యాయం వద్ద ఆందోళన చేపట్టిన నిరుద్యోగుల పై జరిగిన లాఠీచార్జిని, విద్యార్థి నేతల అరెస్టును ఖండించారు.

ఓయూలో ముందస్తు అరెస్టులు

గ్రూప్-2 పరీక్ష వాయిదా కోసం ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టకూడదని ఓయూ శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఎన్ఆర్ఎస్ హాస్టల్ నుంచి బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి, ఇ-2 హాస్టల్ నుంచి గిరిజనశక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ తదితరులను అరెస్ట్ చేశారు.

నేడు నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సదస్సు

బన్సీలాల్‌పేట్: ట్రైన్డ్ నర్సస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(టీఎన్ఏఐ) రాష్ట్ర స్థాయి సదస్సు ఈ నెల 12 శనివారం సికింద్రాబాద్ బోయిగూడ రైల్ కళారంగ్‌లో జరగనుంది. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ స్పీకర్ టి. పద్మారావు, డీఎంఈ రమేష్ రెడ్డి, జేసీకెంప్, నర్సింగ్ డిప్యూటీ డైరెక్టర్ విద్యుల్లత, రిజిస్ట్రార్ విద్యావతి తదితరులు హాజరవుతున్నారు.